
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్టం 40.3 । కనిష్టం 27.2

ఆంధ్రజ్యోతి

ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

శనివారం 8 జూన్ 2024






పంట పొలాన్ని చదును చేస్తున్న రైతు



తొలకరికే.. తొందరపాటు వద్దు!

- జిల్లాలో మృగశిర కార్తెతో వానాకాలం సీజన్ పంటల సాగుకు శ్రీకారం
- పొడి నేలల్లోనే విత్తనాలను వేస్తున్న రైతులు
- ఇప్పటికీ 40 డిగ్రీల వరకు నమోదవుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- కనీసం 60 నుంచి 75మి.మీ.ల వర్షపాతం నమోదైతేనే విత్తనాలను విత్తుకుంటే మంచిదంటున్న అధికారులు
- తొందరపడితే మొలక శాతం తగ్గి.. నష్టపోయే ప్రమాదం
- ఈయేడు అధిక వర్షాలు కురుస్తాయంటున్న వాతావరణ శాఖ
- జిల్లావ్యాప్తంగా 5లక్షల 79వేల 638 ఎకరాల సాగు విస్తీర్ణం



ఆదిలాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జూన్ మాసం మొదలు కావడంతో జిల్లాలో వాతావరణం కొంత చల్లబడినట్లు కనిపిస్తోంది. అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కూడా కురుస్తున్నాయి. శుక్రవారం మృగశిరకార్తె ప్రారంభంకావడంతో వానాకాలం పంటల సాగుకు రైతులు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు కేరళ రాష్ట్రాన్ని తాకాయంటూ వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈసారి సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. జిల్లా సాధారణ వర్షపాతం 1193 మి.మీ.లు కాగా.. గతేడు 1460 మి.మీ.ల అధిక వర్షపాతమే నమోదైంది. ఏప్రిల్, మే మాసాలలో అకాల వర్షాలు కురవడంతో చేతికివచ్చిన యాసంగి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జూన్ మాసం ప్రారంభంకావడంతో గంపెడాశలతో వానాకాల పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో సాగువిస్తీర్ణం 5లక్షల 79వేల 638 ఎకరాలు కాగా.. ఇందులో 4లక్షల 16వేల 969 ఎకరాలలో పత్తి పంట, సోయా పంట 91వేల 762 ఎకరాలు, కంది 61246 ఎకరాలు, జొన్న 2068 ఎకరాలు, వరి 1823 ఎకరాలు, మొక్కజొన్న 4140 ఎకరాలు సాగు కానుంది. కాగా మిగిలిన ఎకరాలలో మినుము, పెసర, ఇతర వర్షాధార పంటలు సాగుకానున్నాయి. అయితే జిల్లాలో ఉష్ణోగ్రతల తీవ్రత కొంత తగ్గుముఖం పట్టినా.. 40 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విత్తనాలను విత్తుకోవడం అనుకూలం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మే చివరి మాసం నుంచి జూన్ మొదటి వారం వరకు కురిసే తొలకరి వర్షాలకే పత్తి, సోయా, కంది పంటలను రైతులు సాగు చేస్తారు. అయితే ఈ యేడు తొలకరికి ముందే విత్తనాలను విత్తడం కనిపిస్తోంది. ఇప్పటికే నీటి వసతి ఉన్న కొంత మంది రైతులు సోయా, పత్తి విత్తనాలను వేశారు. కనీసం 60 నుంచి 75 మి.మీ.ల వర్షపాతం నమోదైతేనే విత్తనాలను విత్తుకుంటే మంచిదని అధికారులు చెబుతున్నారు. రైతులు తొలకరికే తొందరపడితే మొలకశాతం తగ్గిపోయి నష్ట పోయే ప్రమాదం ఉందంటున్నారు.



మొదలైన సాగు సందడి

జిల్లాలో గత పక్షం రోజులుగా సాగు సందడి కనిపిస్తోంది. రైతులు ఇప్పటికే ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసి సాగు పనులకు సిద్ధమవుతున్నారు. నేలలు చదును చేసుకున్న రైతులు మే చివరి వారం నుంచి సోయా, పత్తి విత్తనాలను వేస్తున్నారు. కొన్నిచోట్ల పత్తి మొలక దశలో కనిస్తోంది. ఎక్కువగా పండించే పత్తి, సోయా, కంది, జొన్న, మొక్కజొన్న పంటలను సాగుకు అవసరమైన ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఇప్పటికే వేసవి దుక్కులను పూర్తి చేసిన రైతులు పంట చేన్లను చదును చేయడం, చెత్తను ఏరి వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే వేడి నేలల్లో విత్తనాలను వేస్తేనే సరైన పంట దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. తొలకరికి ముందే విత్తనాలు వేసిన నీటి తడులను అందించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. ఒకటి రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగును చేపడితే మంచిదని సూచిస్తున్నారు. అంతేకాకుండా తలమడుగు, తాంసి, భీంపూర్, జైనథ్, బేల మండలాల్లో నీటి వసతి ఉన్న రైతులు ఇప్పటికే విత్తనాలను వేసి వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు.

జూన్‌లోనూ అధిక ఉష్ణోగ్రతలు

మే చివరి వరకు జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జూన్ మాసం మొదలైన జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత రెండు రోజులుగా వాతావరణం చల్లబడి అక్కడక్కడ జల్లు వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉష్ణోగ్రతల తీవ్రత కనిపిస్తున్నా సాయంత్రం వేళల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షపు జల్లులు కురుస్తున్నాయి. అయిన నేలలో సరైన తేమ కనిపించడం లేదంటున్నారు. జిల్లాలో 40 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 35 డిగ్రీల ఉష్ణోగ్రతల లోపే విత్తనాలను విత్తుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. తేమశాతం అధికంగా ఉన్న నేలల్లోనే విత్తనాలు సరిగా మొలకెత్తే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. పొడి నేలల్లో విత్తనాలు వేసిన మొలకెత్తక పోతే తిరిగి మళ్లీ విత్తనాలను వేసే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. జిల్లాలో పత్తి పంటకు అనువైన నల్ల రేగడి నేలలు ఉండడం, గత రెండు మూడేళ్లుగా మద్ధతు ధర భారీగా పెరుగడంతో రైతులు పత్తి పంట సాగుకే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అలాగే మార్కెట్ వసతి మెరుగ్గానే ఉండడంతో పత్తి పంట సాగుకు ఇబ్బందులు ఉండవన్న భావన కనిపిస్తుంది. ఈ యేడు జిల్లాలో 4లక్షల 16వేల 200 ఎకరాలలో పత్తి పంట సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నా రు. మిగితా ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉంది.

సరైన తేమ ఉంటేనే విత్తనాలు వేసుకోవాలి

: శివకుమార్, ఏవో, ఆదిలాబాద్

రైతులు తొలకరి వర్షాలకే తొందరపడి విత్తనాలను వేసుకోవద్దు. వానకాల పంటల సాగుకు ఇంకా చాలా సమయం ఉంది. సరైన తేమ ఉంటేనే విత్తనాలను వేసుకోవాలి. జల్లు వర్షాలకు విత్తనాలు వేస్తే పూర్తి స్థాయిలో మొలకెత్తే అవకాశం ఉండదు. ఇప్పటికే కొంత మంది రైతులు పత్తి, సోయా పంటలను వేసినట్లు తెలుస్తుంది. నీటి వసతి ఉన్న రైతులు మాత్రమే అక్కడక్కడ విత్తనాలు వేస్తున్నారు. తేమ లేక పోయిన ఆదరబాదరగా ఖరీదైన విత్తనాలను నేలలో వేసి వర్షాల కోసం ఎదురు చూసే పరిస్థితి ఉంటుంది. ఈ యేడు పత్తి, సోయా, కంది పంటలకు వాతావరణం అనుకూలంగానే ఉంది. రైతులు తొందరపడి విత్తనాలు వేసి నష్ట పోవద్దు.

సంక్షిప్త సమాచారం

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు : ఎస్పీ

- గ్రూప్-1కు గట్టి బందోబస్తు ఏర్పాటు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 7:తెలంగాణ ప్రభుత్వ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పోలీసు శాఖ తరపున భద్రత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 18 సెంటర్లలో 6729 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్ష రాయనున్నారన్నారు. పరీక్షకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, పట్టణ ప్రధాన రోడ్లు, చౌరస్తాలలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాలలో సభలు, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించవద్దన్నారు. గుంపులు గుంపులుగా ఎవ్వరు కూడా పరీక్ష కేంద్రం పరిసరాలలో తిరగడానికి అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి జిరాక్స్ షాపులు తెరిచి ఉంచవద్దని షాపు యజమానులకు సూచించారు.బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ తీసుకోవడం జరుగుతుందని, అభ్యర్థులు బయోమెట్రిక్, వెరిఫికేషన్ సిబ్బందికి సహకరించాలని ఎస్పీ పేర్కొన్నారు.

ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్లో పోస్టులు ఖాళీ

ఆదిలాబాద్ రూరల్, జూన్ 7: స్పోర్ట్స్ స్కూల్ ఆదిలాబాద్ ఇంగ్లీష్ మీడియంలో డిప్యూటేషన్‌పై పని చేసేందుకు జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేస్తున్న అర్హత గల సర్‌ప్లస్‌లో ఉన్న ఉపాధ్యాయులను దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో ఈనెల 11లోగా సమర్పించాలని డీఈవో ప్రణిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్‌లో గణితం 1, ఫిజికల్ సైన్స్ 1, బయలాజికల్ సైన్స్ 1, సోషల్ 1, ఇంగ్లీస్ 1, హిందీ 1, తెలుగు 1 పోస్టులు, అలాగే ఎస్జీటీ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని డీఈవో పేర్కొన్నారు.

వీవీల సేవలను పునరుద్ధరించాలని వినతి

ఆదిలాబాద్ రూరల్: గతంలో పని చేసిన విద్యా వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజార్షిషా, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణితను జిల్లా విద్యా వలంటీర్ సంఘం నాయకులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయలు కొరత ఉన్నందున విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని విద్యావలంటీర్లు పేర్కొన్నారు. తమను విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సింగ్, మల్ల య్య, రాంకిషన్, బాల కిషన్, గజానన్, చరణ్‌సింగ్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న వీవీలు

పకడ్బందీగా ఇంటింటి సర్వే చేపట్టాలి

- కలెక్టర్ రాజర్షిషా • జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మొబైల్ అప్లికేషన్‌పై శిక్షణ కార్యక్రమం • పాల్గొన్న జిల్లా అధికారులు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా



పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 7: జిల్లాలోని మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా తెలిపారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మొబైల్ అప్లికేషన్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి మొబైల్ అప్లికేషన్‌పై హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు ప్రోజెక్టర్ ద్వారా పవర్ పాయింట్ ప్రజంటేషన్ మొబైల్ అప్లికేషన్ పై వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా సర్వే నిర్వహించడం జరుగుతుందని, ఆయా గ్రామాలలో ఎంపీడీవోలు, ఏపీవోలు, ఏపీఎంలు టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రెటరీలు, ఈజీఎస్, సీసీ ఐకేపీలను సర్వే అధికారులుగా నియమించడం జరిగిందన్నారు. జిల్లా మొత్తం 847 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, జీపీలు 468, ఇళ్లు 1,47,894 ఉన్నాయన్నారు. ఈ సర్వే ద్వారా జిల్లాలో మిసన్ భగీరథ నల్లా కనెక్షన్‌లు ఎన్ని? నీరు వస్తుందా? లేదా? అనే వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో డీపీవో శ్రీలత, ఎస్ఈ ఎండీ సురేష్, ఈఈ చంద్రమోహన్, డీఎల్‌పీవో ఫనింద్ర, జీవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- గ్రూప్-1 నిర్వహణపై అధికారులతో సమీక్ష

ఆదిలాబాద్ అర్బన్: గ్రూప్-1 పరీక్ష నిర్వహణ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ రాజార్షిషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్ ప్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఐడెంటిఫికేసన్ ఆఫీసర్స్, బయోమెట్రిక్ ఆఫీసర్స్ గ్రూప్-1 పరీక్ష నిర్వహణ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. టీజీపీఎస్సీ ద్వారా ఈనెల 9న నిర్వహించే గ్రూప్-1 పరీక్ష ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని సూచించారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్ష కేంద్రాలలో అన్ని వసతులు ఉండాలని ఆదేశించారు. చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్ష నిర్వహణను చేపట్టాలని, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు కేంద్రాలలో సీటింగ్ అరేంజ్‌మెంట్, వసతులు పరిశీలించి మహిళ, పురుష అభ్యర్థులకు విడివిడిగా తనిఖీ ఏర్పాటు చేయాలన్నారు. ఇతరులను అనుమతించవద్దని తెలిపారు. కాగా, ఈ నెల 9న నిర్వహించే గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షలు 6729 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. పరీక్షల కేంద్రాల గురించి, హాల్ టికెట్ డౌన్‌లోడ్ గురించి జిల్లా స్థాయి హెల్ప్‌లైన్ నెం.9491053677కు సంప్రదించాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు అనుమతి ఉంటుందని, తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధికారులున్నారు.

సమస్యల పరిష్కారానికి సమన్వయంతో కృషి

- మండల సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, జూన్ 7: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవవారం మండల కేంద్రలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ పంద్ర జైవంతరావు అధ్యక్షతన ప్రారంభంకాగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యుత్ అంతరాయం లేకుండా ప్రజలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని అప్రకటిత విద్యుత్ కోతలు పెట్టరాదని అన్నారు. ఉట్నూర్ పట్టణంతో పాటు మండలంలోని గ్రామాలలో ఇండ్ల పై నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్లను తొలగించి వేరేచోట స్తంభాలు ఏర్పాటు చేయాలని వాటికి కావాల్సిన నిధులు మంజూరు చేయిస్తామని అన్నారు. రైతుల భూములకు కావల్సిన విద్యుత్ లైన్‌ల ఏర్పాటుకు విద్యుత్ అధికారులు కృషి చేయాలని ఏఇ శ్రావణ్‌ను ఆదేశించారు. ఉట్నూర్ మండలంలో కల్తీ విత్తనాలు దళారుల ద్వారా అమ్మకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి రాథోడ్ గణేష్‌ను ఆదేశించారు. రైతుబీమా కోసం వచ్చే రైతుల నుంచి కొంతమంది వ్యవసాయ విస్తరణ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు వైస్ ఎంపీపీ దావులే బాలాజి ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో అవినీతిపరులపై చర్యలు తీసుకోవా లని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆ తర్వాత కుటుంబ నియంత్రణ శిబిరాలు నిర్వహిస్తున్నారా? గిరిజన గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని షాంపూర్, హస్నాపూర్, దంతనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లను ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ రాథోడ్‌సందీప్ మాట్లాడుతూ ఈ నెల 20న నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఉట్నూర్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 3.37 లక్షల పని దినాలను కూలీలకు కల్పించడం జరిగిందని ఈజీఎస్ ఏపీవో రజినికాంత్ తెలిపారు. నీటిఎద్దడి నివారణ కోసం అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేశామని ఎంపీవో లింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలు, ఐసీడీఎస్, మిషన్ భగీరథ, ఇందిరాక్రాంతి పథకం, విద్యాశాఖ, తదితర అంశాలపై చర్చించారు. ఇందులో ఎంపీడీవో శర్మ, డిప్యూటీ తహసీల్దార్ భుజంగరావు, డీసీసీబీ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రషీద్, ఎంపీటీసీలు గోపాల్‌రావు జాదవ్, మోహన్‌సింగ్ జాదవ్, కోరింగ రాణి, కౌసల్య, లచ్చు పటేల్, సల్గారే రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

- 'నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి'

ఉట్నూర్: అధికారులు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఖానాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ట్రైబల్‌వెల్ఫేర్, పంచాయతీ రాజ్, సోషల్ వెల్ఫేర్, విద్యుత్ శాఖ, అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఉట్నూర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ మార్నింగ్‌వాక్ ద్వారా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోని బోయవాడ, శాంతినగర్, పాత ఉట్నూర్, ఎత్మాసూర్ నగర్ కాలనీలలో డ్రైనేజీ, సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జుపటేల్ భూమిపూజలు చేసి పనులు ప్రారంభించారు.



అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్

'మహారాష్ట్రకు అనుమతి లేకుండా విత్తనాలు తరలిస్తే కఠిన చర్యలు తప్పవు'

తలమడుగు, జూన్ 7: ఎలాంటి అనుమతి లేకుండా మహారాష్ట్రకు పత్తి విత్తనాలు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రాజమోహన్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని లక్ష్మంపూర్ అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన పత్తి విత్తనాలు ఎరువులు ఎలాంటి అనుమతులు లేకుండా మహారాష్ట్ర ఇతర రాష్ట్రాలకు తరలిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెక్‌పోస్టు వద్ద ప్రతీ వాహనాన్ని ముమ్మరంగా తనిఖీ చేయాలని సూచించారు. ఇందులో ఏఎస్సై సురేందర్, వ్యవసాయ అధికారులు, చెక్‌పోస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అతరాయం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 7: ఈనెల 8న భుక్తాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్ సదానందం ఒక ప్రకటనలో తెలపారు. విద్యానగర్, భుక్తాపూర్, ద్వారకనగర్, సినిమారోడ్, మోచిగల్లి ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. అదేవిధంగా భుక్తాపూర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల వల్ల ఉదయం 9నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈఓపీఏడీబి నార్త్ ఒక ప్రకటనలో తెలిపారు. భుక్తాపూర్, భాగ్యనగర్, వడ్డెరకాలనీ, క్రాంతినగర్, హమాలీవాడ, తాటిగూడ, మహాలక్ష్మివాడ, చిల్కూరిలక్ష్మినగర్, జైజవాన్‌నగర్, గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్, శివాజీ చౌక్, రైల్వేస్టేషన్ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అదేవిధంగా సీసీఐ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం సీసీఐ సబ్‌స్టేషన్ పరిధిలోని జీఎస్ఎస్టేట్, తిర్పెల్లి, బద్ధు మహళ్ల, బ్రహ్మణవాడ, పంజేశా ప్రాంతాలలో ఉదయం 9నుంచి 12గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజనీర్/ఆపరేషన్/ఆదిలాబాద్ నార్త్ సెక్షన్, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆదిలాబాద్‌టౌన్ మండలం తెలిపారు. అలాగే రిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీ, కలెక్టర్‌చౌక్, ఓల్డ్ హౌజింగ్‌బోర్డు, సంజయ్‌నగర్ ప్రాంతాలలో ఉదయం 7నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజనీర్/ఆపరేషన్/ఆదిలాబాద్ టౌన్ 3 సెక్షన్, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆదిలాబాద్ టౌన్ మండలం తెలిపారు. విద్యుత్ అంతరాయంకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మార్కెట్ పదవులు ఫైనల్

- త్వరలోనే అధికారిక ప్రకటన

ఆదిలాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నియోజకవర్గంలో మార్కెట్ కమిటీల పదవులను ఫైనల్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఎన్నికలకు ముందే దాదాపు ఛైర్మన్ పదవులు ఖరారైన ఎన్నికల కోడ్‌తో నిలిపి వేశారు. గురువారంతో లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియడంతో మళ్లీ మార్కెట్ పదవుల నియామకం తెరపైకి వస్తుంది. ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కొర్రెడ్డి కిషన్, వైస్ ఛైర్మన్‌గా తలమడుగు మండలానికి చెందిన ప్రకాష్‌రావులను నియమించే అవకాశం ఉంది. అలాగే జైనథ్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా అల్లూరి అశోక్‌రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా చప్రాల గ్రామానికి చెందిన విలాస్‌పటేల్‌ల నియామకం దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తుంది. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన గిమ్మా సంతోష్ కూడా మార్కెట్ ఛైర్మన్ పదవిని ఆశిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ముందు నుంచి కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పని చేసిన గిమ్మా సంతోష్‌కు పలువురు నేతలు మద్ధతు పలుకుతున్నట్లు తెలుస్తుంది. పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అవకాశం కల్పిస్తే గిమ్మ సంతోష్‌కు ఛైర్మన్ పదవి దక్కే అవకాశాలు లేక పోలేదు.



గుడిహత్నూర్‌లో కురుస్తున్న వర్షం

గుడిహత్నూర్‌లో ఈదురుగాలుల వర్షం

గుడిహత్నూర్, జూన్7: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఒక మోస్తారుగా ఎండ కాసి అనంతరం సాయంత్రం సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. దీంతో ఈదురు గాలులు మెరుపులతో వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

అనధికారిక విద్యుత్ కోతలతో ఇబ్బందుల్లో వినియోగదారులు

బోథ్, జూన్7: మండలంలో అనధికారిక విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయి ప్రభుత్వ పెద్దలు విద్యుత్ కోతలు విధిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నా. మరోవైపు అనధికారిక విద్యుత్ కోతలు కొనసాగుతూనే ఉన్నాయి. సాయంత్రం పూట ప్రతీరోజు ఆరున్నర గంటల నుండి 7:30 ఒక్కోసారి 8గంటల వరకు కోతలు విధిస్తున్నట్లు మండలంలోని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సాయంత్రం పూట విద్యుత్ కోత విధించడం వల్ల గృహిణులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు మరోవైపు దోమల బెడద తీవ్రంగా ఉండడంతో సాయంకాలం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు చిన్నపాటి గాలిదుమారానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది.

ఆదివాసీ గూడలలో కప్పతల్లి ఆట

తాంసి, జూన్ 7 : తాంసి మండలంలోని ఆదివాసి గూడలలో కప్పతల్లి బావేత అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం అవుష్ పండుగ జరుపుకున్నారు. సకాలంలో వర్షాలు కురవాలని, పాడి పంటలు బాగుండాలని గ్రామదేవతల ఆలయాలకు వెళ్లి దర్శించుకున్నారు. అనంతరం గ్రామపటేల్ ఇంటి నుంచి మొదలుకుని ప్రతీ ఇంటికి తిరుగుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పిడుగుల కాలం.. అప్రమత్తత తప్పనిసరి

● జిల్లాలో పిడుగుపాటుతో పలువురు మృత్యువాత ● జాగ్రత్త చర్యలు పాటిస్తే తప్పుతుంది ప్రాణాపాయం..



భైంసా, జూన్ 7: ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పులతో గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. పొలాలకు వెళ్లే రైతులు, పశువులు పిడుగుల బారినపడి చనిపోతున్నాయి. రెండు రోజుల క్రితం జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామంలో ఓ యువరైతు, తానూర్ మండలంలోని ఎల్వత్ గ్రామంలో 12 ఏళ్ల బాలుడు పిడుగుపాటు బారిన పడి మృతి చెందారు. ముథోల్, తానూర్ మండలాల పరిధిలో పిడుగు పాటుతో పలు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. గత నెలలో కూడా మనుషులు, పశువులు ప్రాణాలు వదిలిన ఘటనలు జరిగాయి. ఈ నేపథ్యంలో పిడుగు పాటుపై అవగాహన పెంచుకోవడంతో పాటు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.



పిడుగుపాటు మృతులు (ఫైల్ ఫొటోలు)



● ఎలా సంభవిస్తుంది..?

మేఘాల నుంచి భూ ఉపరితలాన్ని తాకే శక్తిమంతమైన ప్రవాహం పిడుగు. వాతావరణం చల్లబడినప్పుడు మేఘాలలో ద్రవ, ఘన పదార్థాలు ఉత్పన్నమవుతాయి. వీటిని బలమైన గాలి తోడైనప్పుడు నీరు, మంచు బిందువులు మధ్య రాపిడి ఏర్పడుతుంది. ఫలితంగా మేఘాలలో కొన్ని వేల కోట్ల పాజిటివ్, నెగటివ్ చార్జిలు ఏర్పడతాయి. ఇవి ఒక దానికొకటి ఆకర్షించుకున్నప్పుడు అమితమైన విద్యుచ్ఛక్తి వేడిపుడుతుంది. ఇక పిడుగు సుమారు 30 కోట్ల వోల్టుల విద్యుత్తు శక్తిని కలిగి ఉంటుంది. పిడుగుల చుట్టూ ఉన్న కలిగి ఉంటుంది. పిడుగులు చుట్టూ ఉన్న గాలిని రెప్పపాటులో వేడెక్కించి భయంకరమైన శబ్దాన్ని సృష్టిస్తాయి. వర్షం కురిసే సమయంలో కేవలం మేఘాలలోనే కాదు నేలపై ఉండే ఎత్తైన ప్రదేశాలు, చెట్లు, లోహల వంటి వాటిపై కూడా పిడుగులు పడుతుంటాయి. ఎత్తైన చెట్లు, అపార్టుమెంట్లు, విశాల మైదానాలు భవనాలు, డాబాలు, కరెంటు స్తంభాలు వంటి లోహాలు పిడుగులను ఆకర్షిస్తుంటాయి. పిడుగుపాటుకు గురైన వాళ్ల తర్వాత జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, పక్షవాతం వంటి శారీరక సమస్యలకు గురవుతున్నారు.

● ఏం చేయకూడదు..?

● వర్షం పడుతున్న సమయంలో ఎత్తయిన చెట్లు, సెల్ టవర్లు, స్తంభాలు, కొండల వద్దకు వెళ్లకూడదు. విద్యుత్తు నియంత్రికలకు దూరంగా ఉండాలి.

● కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్‌లు, గేమ్ సిస్టమ్‌లు, విద్యుత్తు స్టవ్‌లు, ఇతర విద్యుత్తు పరికరాలు ఉపయగించవద్దు. వర్షం కురిసినప్పుడు విద్యుత్తు సరఫరా హెచ్చుతగ్గుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

● గుంపులుగా కాకుండా దూరంగా ఉండాలి. ఉరుములు, మెరుపుల సమయంలో స్నానాలు వంటివి చేయరాదు. ఇనుప కడ్డీలు ఉన్న గొడుగులు వాడరాదు.

● పొలాల్లో పని చేయడం, పశువులను మేపడం, చేపలు పట్టడం వంటివి చేయొద్దు. ప్రయాణాలు చేయకపోవడం మంచిది. చెరువులు, కుంటలు, ఈత కొలనులు వంటి బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలి.

● తలదాచుకునేందుకు ఆశ్రయం లేనపుడు తనకు తానుగా మోకాళ్లపై చేతులు,తల పెట్టి దగ్గరగా బంతిలా ముడుచుకొని కూర్చోవాలి. చెవులు మూసుకోవడం ద్వారా తరంగాలు లోపలికి వెళ్లకుండా చూసుకోవచ్చు. భూమిపై అరికాళ్లు పూర్తిగా అనించకుండా వేళ్లపై నిలుచోవాలి. నీటిలో ఉంటే సాధ్యమైనంత వరకు తొందరగా బయటకు రావాలి.

అటవీ ప్రాంతంలో ఉంటే మరుగజ్జు, చిన్న చెట్ల కింద ఆశ్రయం పొందాలి.

● ఇంటికి ఎర్తింగ్ తప్పనిసరి...



పిడుగు పడే వాతావరణ ఉందన్నప్పుడు ఇంట్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయాలి. ఆ సమయంలో ఓల్టేజి వచ్చి విద్యుత్తు ఉపకరణాలు దెబ్బతింటాయి. నివారణకు తప్పనిసరి ప్రతి ఇంటికి ఎర్తింగ్ చేయించాలి. ఫ్యూజులకు సరైన రేటింగ్ కలిగిన తీగను ఉపయోగించాలి. విద్యుత్తు బోర్డుల నుంచి ప్లగ్‌ను తొలగిస్తే పూర్తి రక్షణగా ఉంటుంది.

● ముందే తెలుస్తుంది.

ఇప్పుడున్న ఆధునాతన పరిజ్ఞానం ద్వారా 30 నుంచి 40 నిమిషాల ముందే పిడుగు పడే ప్రదేశాన్ని గుర్తించి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అలాంటప్పుడు ఆ ప్రాంతాలకు వెళ్లకుండా ఉండడం మంచిది.

● పరిహారం..

2015లో విడుదల చేసిన జీవో నెం.2 ప్రకారం పిడుగుపాటుకు గురైన మనిషి మృతి చెందితే రూ. 6లక్షలు, పశువులు మృతి చెందితే రూ. 30వేలు ఎక్స్‌గ్రేషియా (పరిహారం) ఇవ్వాలి.

జాగ్రత్తలే రక్ష..

● సింగన్న, అగ్నిమాపక అధికారి, భైంసా

ఉరుములు, మెరుపులు ఉండేటప్పుడు బయటకు తిరగడం అపివేయాలి. ఎవరికి వారు స్వీయజాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. వస్తువులకు భద్రత ముఖ్యం. పిడుగుపాటుకు గురైతే తక్షణం ఆస్పత్రికి తరలించాలి.

పిడుగుపాటుకు బాలుడి మృతి



సారంగాపూర్, జూన్ 7:మండలంలో గల దుర్గానగర్ తండాకు చెందిన జాదవ్ కృష్ణ(14) అనే బాలుడు శుక్రవారం పిడుగు పాటుకు గురై మృతి చెందినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుర్గానగర్ తండా సమీపంలో గల పంట చేనులోకి తల్లిదండ్రులతో కలిసి వెళ్లిన సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసిన సమయంలో పంట పొలాల్లో ఉన్నటువంటి కృష్ణకు పిడుగు కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు కృష్ణ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకురాలు

ప్రజాతీర్పును గౌరవిస్తాం

● కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సుగుణక్క

నేరడిగొండ, జూన్7:రాజకీయ లబ్ధికోసం బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించిందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రంసుగుణక్క అన్నారు. నేరడిగొండ కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్‌క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ లోక్ సభ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందినప్పటికి ప్రజల తీర్పును గౌరవిస్తున్నానని, ప్రాణమున్నంత వరకు ప్రజలకు సేవలందిస్తానన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. నేరడిగొండ మండల అధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, మండల అధ్యక్షులు రమేష్, మాజీ సర్పంచ్ శేషరావు రాథోడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండి అసిఫ్, జిల్లా యూత్ ప్రెసిడెంట్ శ్యామ్, సీనియర్ నాయకులు అబ్దుల్లా, మల్లేష్, అనిల్‌గౌడ్, కళావతి, వసంతరావు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సిరికొండలో..

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో హవల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సిరికొండ మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ సూర్యవంశీ రాజేశ్వర్ ఇటీవల ఆటో ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ, బోథ్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఆడే గజేందర్ శుక్రవారం వారి స్వగృహానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమె వెంట మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, మాజీ మండల అధ్యక్షుడు కంచం లక్ష్మణ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మహ్మద్‌ఖాన్, బొడ్డు నవీన్, బొడ్డు దత్తాద్రి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: పిడుగు పాటుకు గురైన బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ నాయకు రాలు ఆత్రం సుగణ పేర్కొన్నారు. గురువారం రాత్రి వ్యవసాయ పనులు చేస్తుండగా.. పిడుగు పాటుకు మృతిచెందిన మండలంలోని డోంగార్ గావ్‌కు చెందిన భార్య భర్తలు సంతోష్, స్వప్న కుటుంబ సభ్యులను శుక్రవారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా తనవంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో సైతం అండగా ఉంటామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఆమె వెంట మండల అధ్యక్షులు ఉత్తం, అతిష్, సాగర్, బాస్కర్, గోవింద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.



'బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం'



మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

ముథోల్, జూన్ 7:ముథోల్ నియోజకవర్గంలో ప్రమాద వశాత్తు జరిగే సంఘటనల పట్ల బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మోహన్ రావు పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన మెత్రి నరేందర్ అనే యువకుడు విద్యుత్ షాక్ తగిలి ఇటీవలే మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి తన ట్రస్ట్ ద్వారా పది వేల రూపాయల చెక్కును మృతుడి భార్యకు అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ముథోల్ నియోజకవర్గం లో ప్రమాదవశాత్తు జరిగే సంఘటనలు ప్రమాదం, పాము కాటు, షార్ట్ సర్క్యూట్, పిడుగు పాటు, వరద ప్రమాదం అనుకోని సంఘటనలు జరిగితే మోహన్‌రావు పటేల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందించి బాసటగా ఉంటామని ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, మాజీ సర్పంచ్ నిమ్మ పోతన్న, నాయకులు ఉదయ్, భూమన్న, సాయినాథ్, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కృషి మరవలేనిది : ఎంపీ నగేష్



ఎంపీ నగేష్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

తలమడుగు, జూన్7: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తన గెలుపు కోసం కార్యకర్తలు చేసిన కృషి మరిచి పోలేదని ఎంపీ నగేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఖోడద్ గ్రామానికి చెందిన యువజన సంఘాల సభ్యులు గ్రామస్థులు ఎంపీ నగేష్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోదీ కృషి పట్టుదలతో భారతీయజనతా పార్టీ మూడోసారి అధికారంలోకి వచ్చిందన్నారు. అదే విధంగా ఆదిలాబాద్ పార్లమెంట్ నుంచి తనను గెలిపించిన ప్రతి కార్యకర్తకు అభినందనలు తెలియజేశారు. ఇందులో బీజేపీ సీనియర్ నాయకులు వెంకటస్వామి, మండల నాయకులు సురరాజేశ్వర్, అశోక్, సంతోష్‌భారత్, లింగారెడ్డి, బోజారెడ్డి, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నాయకులను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌అర్బన్:ఢిల్లీలో జాతీయ నాయకులను ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్, ఎమ్మెల్యే పాయలశంకర్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. కాగా శుక్రవారం మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్‌షిండేను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం అభ్యర్థిగా నగేష్ విజయం సాధించడం పట్ల మహారాష్ట్ర సీఎం అభినందనలు తెలిపారు. ఇందులో ముస్తాపూర్ అశోక్ తదితరులున్నారు.

ఘనంగా మృగశిర కార్తె

ముథోల్, జూన్ 7 : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం మృగశిర కార్తె పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారి ఇష్ట దైవాలకు పూజలు చేశారు. ప్రీతికరమైన మామిడి పండ్లను నైవేద్యంగా సమర్పించుకున్నారు. రైతులు వ్యవసాయ పనులను ప్రారంభానికి సూచికగా జరుపుకునే పండుగ కావడంతో రైతులు మృగశిర ప్రవేశ సమయంలో ఈ వేడుకను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ రోజున నైరుతి ఋతుపవనాల ప్రభావంతో వర్షం పడితే సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు, సుఖసంతోషాలతో ఉంటారని విశ్వసిస్తారు. దీంతో రైతులు వర్షం పడాలని భగవంతుడిని వేడుకుంటూ పూజలు జరిపారు. మృగశిర కార్తె పర్వదినాన మామిడి పండ్లు, చేపలను తినడం సాంప్రదాయంగా వస్తోంది. దీంతో మార్కెట్‌లో మామిడి పండ్లకు, చేపలకు గిరాకీ పెరిగి అమ్మకాలు జోరుగా సాగాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లక్ష్మణచాంద, జూన్ 7 : మండలంలోని లక్ష్మణచాంద, నర్సాపూర్(డబ్ల్యూ) సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉండనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ మహేష్ కుమార్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ప్రతీ రెండవ శనివారం నిర్వహణ మరమ్మతులు ఉన్నందున ఈ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

జీలుగ బస్తాల కొరత...

మండల వ్యాప్తంగా జీలుగ విత్తనాలు కొరత ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

'జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి'

బోథ్, జూన్ 7:శనివారం నిర్వహించనున్న లోక్ అదాలత్ ను విజయవంతం చేసేందుకు గాను ప్రతి ఒక్కరు కృషి చేయాలని బోథ్ మున్సిపల్ మెజిస్ట్రేట్ బి.హుస్సేన్ కోరారు. శుక్రవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కక్షిదారులు విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్‌అదాలత్‌లలో రాజీ కుదుర్చుకునే విధంగా చూడాలని కోరారు.

జిల్లా వైద్యాధికారికి సన్మానం

ఆదిలాబాద్ రూరల్, జూన్ 7:ఆదిలాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాథోడ్‌నరేందర్‌ను ఎస్సీ, ఎస్టీ వైద్య ఉద్యోగుల సంఘం అధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా వైద్యాధికారిగా 4 సంవత్సరాలు బాధ్యతలు పూర్తయిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.శ్రీని వాస్, బాబులాల్, సురేష్, సుభాష్, వసంత, శ్యామల తదితరులున్నారు.

ఇంద్రవెల్లిలో గుట్కా ప్యాకెట్ల పట్టివేత

ఇంద్రవెల్లి , జూన్ 7:నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కిషోర్ కిరాణ దుకాణంలో పోలీసులు తనిఖీ చేయగా 47000 గుట్కా ప్యాకెట్లు లభించడంతో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కరెంట్ షాక్‌తో ఒకరి మృతి

ఖానాపూర్, జూన్ 7 : విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిన హృదయ విధారక ఘటన ఖానాపూర్ మండలం బీర్నంది గ్రామ పంచాయతీ పరిధిలోని ఇప్పమాడ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై జి. లింబాద్రి తెలిపిన కథనం ప్రకారం... ఇప్పమాడ గ్రామానికి చెందిన తొడసం శ్రీకాంత్(23) అనే యువకుడు తాను నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి నీరు పట్టేందుకు తన ఇంటి సమీపంలోని ఓ వ్యవసాయ బావికి విద్యుత్ మోటార్ అమర్చాడు. కాగా శుక్రవారం విద్యుత్ మోటార్ పనిచేయకపోవడంతో మోటార్‌ను బయటకు తీసి తన చేతితో పట్టుకున్నాడు. దీంతో వెంటనే శ్రీకాంత్‌కు షార్ట్ సర్క్యూట్ అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాంత్ తండ్రి ఇస్రు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని ఎస్సై లింబాద్రి పరిశీలించారు. శ్రీకాంత్ విద్యుత్ షాక్‌తో మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అములుకున్నాయి.

లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి

- మండల వ్యవసాయ అధికారి మహేందర్

తలమడుగు, జూన్ 7: ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి మహేందర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ప్రభుత్వ అనుమతి లైసెన్స్ ఉన్న దుకానంలోని విత్తనాలు కొనుగోలు చేసి తప్పనిసరిగా రషీదు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా విత్తనాలకు సంబంధించిన పూర్తి సమాచారం. రషీదులో పొందుపరచాలన్నారు. ముఖ్యంగా రైతులు పూర్తి స్థాయిలో వర్షాలు పడే వరకు విత్తనాలు విత్తవద్దన్నారు. భూమిలో తేమ శాతం లేకపోతే విత్తనాలు మొలకెత్తగా రైతులు నష్టపోతారన్నారు. గ్రామాల్లో గల వ్యవసాయ విస్తరణ అధికారుల సలహాలు సూచనలు పాటించి అధిక దిగుబడి పొందాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

● ఎంపీడీఓ చంద్రశేఖర్




విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంపీఈఓ

తలమడుగు, జూన్7: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య విద్యార్థులకు లభిస్తుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, ఉచిత భోజనం దుస్తులు విశాలమైన క్రీడా ప్రాంగణం అనేక వసతులు లభిస్తే అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా ప్రభుత్వ పాఠశాల పంపించాలని సూచించారు. గ్రామాల్లో బడీ ఈడు పిల్లలందరిని తప్పకుండా బడికి పంపించాలన్నారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంట్రావు, వెంకటరమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, రమణ, మంజుల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని ఆయా పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు.

కప్పర్లలో బడిబాట

తాంసి, : బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కప్పర్ల గ్రామంలో బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో బడిబాట కార్యక్రమంపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించే ప్రయత్నం చేశారు. 5వ తరగతి చదివి ఆరవ తరగతి ప్రవేశాన్ని కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజన్న, టీచర్స్ జయవర్ధన్, నవ్య, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.



ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ, నవీకరణకు అనుమతి

● ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌పై కట్టిన సిద్ధుల కుంట ఎత్తిపోతల పథకం పునరుద్ధరణతో పాటు ఇదే ప్రాజెక్టుపై కట్టిన కనకాపూర్ ఎత్తిపోతల పథకం నవీకరణకు నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వ పరిపాలనపరమైన అనుమతినిచ్చింది. సిద్ధులకుంటకు రూ.80.50 లక్షలు, కనకాపూర్ ఎత్తిపోతలకు రూ.1.42 కోట్లను విడుదల చేసింది. ఇక పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని గొల్లపల్లి గ్రామంలో మానేరువాగుపై నిర్మిస్తోన్న చెక్‌డ్యామ్ సవరణ అంచనాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2020లో రూ.21.07 కోట్లతో దీని నిర్మాణానికి పరిపాలనపరమైన అనుమతినివ్వగా... తాజాగా దీనికి రూ.27.09 కోట్ల సవరణ అంచనాలకు అనుమతినిస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు.



పాఠ్య పుస్తకాల పంపిణీ

నేరడిగొండ, జూన్ 7: మండల కేంద్రంలో శుక్రవారం పాఠ్యపుస్తకాలను ఎంఈఓ భూమారెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను బడిలో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పై ఉందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు రెండు జతల బట్టలు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించడం జరుగుతుందని అన్నారు.

ఇంద్రవెల్లి:ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఉచితంగా పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం అందిస్తుందని ఎంఈవో నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంఈవో కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి అర్హత గల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో ఉంటారన్నారని, వీరు అకింత బావంతో పని చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాత్లే గంగారాం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పిడుగుపాటుతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

బోథ్, జూన్ 7 : మండంలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి పిడుగులు పడడంతో బోథ్ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది ఒకేసారి ఉరూములతో కూడిన పిడుగులు పడడంతో సబ్ స్టేషన్‌లోని ట్రాన్స్ ఫార్మర్‌లో ఫీజులు చెడిపోయి సాంకేతిక లోపం ఏర్పడింది వెంటనే సంబంధిత ట్రాన్స్కో అధికారులు విషయాన్ని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అధికారులకు తెలపడంతో తక్షణమే మరమ్మత్తుల కోసం ఎం ఆర్ టి బృందాన్ని పంపించారు. వచ్చిన అధికారులు సబ్ స్టేషన్ను పరిశీలించి సాంకేతిక లోపాన్ని గుర్తించి మరమ్మతులు చేపట్టారు దాదాపు గంటన్నరసేపు విద్యుత్ సరఫరాకు అంతారాయం కలిగింది మరమ్మత్తుల అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. మరమ్మతులు చేసిన వారిలో ఏ ఈ తో పాటు జేఎల్ ఎం రామకృష్ణ ,రాకేష్ రాజు, అంజార్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: శనివారం 33కేవీ నేరడిగొండ ఫీడర్ పీఎంఐ కొరకు నేరడిగొండ సెక్షన్ స్టాఫ్, బోథ్ సెక్షన్ స్టాఫ్ అందరు కలిసి చెట్ల కొమ్మలు, రిమార్క్ ఏమి ఉన్నాయో అన్ని అవ్వాలి. సమయం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ సమయంలో నేరడిగొండ మండలం, బోథ్ సబ్‌స్టేషన్ టౌన్, మర్లపల్లి పాట్నాపూర్ ఏరియాలో విద్యుత్ అంతరాయం ఉంటుంది. వినియోగదారులు సహకరించాని ఏఏఈ నాగేంద్ర తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇంద్రవెల్లి : మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కొన్ని గంటల పాటు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ జాదవ్ రోహిదాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.7 । కనిష్ఠం 27.5



నిర్మల్
జిల్లా వార్తలు

8

శనివారం 8 జూన్ 2024



● నిరుపయోగంగా సిద్దిలకుంట ఎత్తిపోతల పథకం (ఫైల్)



● మూలనపడ్డ నర్సాపూర్ వద్ద నిర్మించిన ఎత్తిపోతలు (ఫైల్)

ఎండమావులుగా.. ఎత్తిపోతలు!

- జిల్లాలో చాలా చోట్ల మూతబడ్డ సాగునీటి పథకాలు
- నిధుల కొరతతో ఎక్కడికక్కడే నిలిచిపోయిన మరమ్మతులు
- నిరుపయోగంగా వస్తు సామగ్రి
- నీరుగారిన సాగు లక్ష్యం
- అడుగడుగునా నిర్వహణ లోపం
- నిధుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం
- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 68 ఎత్తిపోతల పథకాలు నిర్మించగా.. సగానికి పైగా పని చేయడం లేదంటూ ఫిర్యాదులు

నిర్మల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బీడు భూములను సాగులోకి తీసుకువచ్చేందుకు నిర్మించిన ఎత్తిపోతల పథకాలన్నీ ఆశించిన మేరకు పని చేయడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 68 ఎత్తిపోతల పథకాలు నిర్మించగా ఇందులో నుంచి సగంకు పైగా పని చేయడం లేదన్న ఫిర్యాదులున్నాయి. సంబంధిత శాఖ అధికారుల నిర్వాకం కారణంగానే కాకుండా రైతుల అవగాహన లోపం, నిధుల కొరత ఈ పథకాల నిర్వహణకు సమస్యగా మారిందన్న వాదనలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎత్తిపోతల పథకాల నిర్వహణకు సంబంధించి నిధులు విడుదల చేయకపోవడం, అలాగే నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించకపోతుండడం ఈ పథకాల అమలుకు శాపంగా మారిందని అంటున్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు ఆశించిన మేరకు లక్ష్యాన్ని సాధించడంలో విఫలమవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. సంబంధిత ఐడీసీ అధికారుల లెక్కల ప్రకారం మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 68 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఇందులో నుంచి నిర్మల్ జిల్లాలో మొత్తం 42 ఎత్తిపోతల పథకాలు ఉన్నట్లు అధికారులు వివరిస్తున్నారు. కాగా జిల్లాలో కేవలం 19 ఎత్తిపోతల పథకాలు మాత్రమే పని చేస్తుండగా.. మిగతా 22 ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయన్న విమర్శలున్నాయి. అలాగే మంచిర్యాల జిల్లాలో మొత్తం 13 ఎత్తిపోతల పథకాలకు గాను ఏడు ఎత్తిపోతల పథకాలు పని చేయడం లేదంటున్నారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఐదు ఎత్తిపోతల పథకాలు ఆదిలాబాద్‌లో రెండు ఎత్తిపోతల పథకాలు పని చేయకుండా నిరుపయోగంగా మారాయి. అయితే అధికారులు చెబుతున్న లెక్కలకు వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయంటున్నారు. అధికారులు చెబుతున్నట్లు పని చేస్తున్న ఎత్తిపోతల పథకాలలో కూడా అనేక లోపాలున్నట్లు విమర్శలున్నాయి. జలాశయాలు, నదులు, వాగులు ఉన్న ప్రాంతంలో ఈ ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతంలోని జలాశయాలను లక్ష్యంగా చేసుకొని నిర్మించిన ఎత్తిపోతల పథకాల ద్వారా వందలాది ఎకరాలకు సాగునీరును అందించాలన్న లక్ష్యాన్ని నిర్ధారించారు. చాలాచోట్ల ఎత్తిపోతల పథకాలు పూర్తిగా నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోతుండడమే సమస్యకు అసలు కారణంగా పేర్కొంటున్నారు. ఇలా నెలల తరబడి ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పరికరాలు, పంపులు, మోటార్లు, పైప్‌లైన్లకు మరమ్మతులు చేయకపోతుండడం ఈ పథకానికి ఆటంకంగా మారింది. అప్పటి ప్రభుత్వం ఓవైపు ఇరిగేషన్ రంగానికి కోట్లాది రూపాయలు మంజూరు చేసినట్లు ప్రకటించినప్పటికీ.. ఎత్తిపోతల పథకాల నిర్వహణ విషయంలో మాత్రం పూర్తి గా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా మరమ్మతులు, నిర్వహణకు సంబంధించిన నిధుల విడుదల విషయంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏళ్ల నుంచి నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న ఫిర్యాదులున్నాయి.



నిరుపయోగంగా మారిన ఎత్తిపోతల పథకం(ఫైల్)



వృథాగా పడివున్న పరికరాలు(ఫైల్)

నిర్మించి ఏళ్లు గడుస్తున్నా..

జిల్లాలోని లోకేశ్వరం మండలం మన్మద్ గ్రామంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ఇప్పటివరకు సంబంధిత శాఖ అధికారులు ఆ పథకం పరిధిలోని రైతులకు అప్పగించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ పథకం చెడిపోయి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు ఇప్పటివరకు పూర్తి కాలేదు. రైతులు చాలాసార్లు అధికారులకు ఈ విషయమై వినతి పత్రాలు అందజేసినప్పటికీ వారిలో స్పందన కనిపించడం లేదంటున్నారు. ఈ పథకం నిరుపయోగంగా మారిందన్న ఆరోపణలున్నాయి.

కోట్లాది రూపాయలు వృథా

కాగా కోట్ల రూపాయలతో నిర్మించిన ఎత్తిపోతల పథకాలన్నీ చాలాచోట్ల వృధాగా ఉండడం గమనార్హం. కొన్ని ఎత్తిపోతల పథకాల వద్ద మోటార్లు చెడిపోవడం అలాగే పంప్ హౌస్‌లలో రిపేర్లు రావడం, పైప్‌లైన్లు లీకేజీ కావడం లాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు మరమ్మతుల పనులు చేపట్టినట్లయితే ఈ పథకాలన్నీ సక్రమంగా పనిచేసే అవకాశాలు ఉంటాయంటున్నారు. నిధుల కొరత కారణంగా మరమ్మతుల పనులు ఎప్పటికప్పుడు చేయలేకపోతున్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా నిధుల కొరత కారణంగానే ఈ పథకాలు నిర్వీర్యం ఏమవుతున్నాయని అంటున్నారు. అలాగే రైతులకు కూడా పూర్తిస్థాయిలో పథకాల నిర్వహణపై అవగాహన కల్పించకపోవడం, సంబంధిత ఎత్తిపోతల పథకాల పరిధిలోని రైతు సంఘాల సభ్యులకు నిరంతర శిక్షణలు ఇవ్వకపోవడం లాంటి అంశాలు ఈ పథకాల వైఫల్యానికి కారణం అవుతున్నాయంటున్నారు.

లక్ష్మీపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలి

● నంది రామయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల కార్యదర్శి



కడెం మండలంలోని లక్ష్మీపూర్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.40 కోట్ల నిధులను మంజూరు చేసినప్పటికీ.. అటవీ శాఖ నుంచి అనుమతులు రాక ఆ లిఫ్ట్ ఇరిగేషన్ టెండర్ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణంపై దృష్టి సారించి అటవీ శాఖ అనుమతులు తీసుకువచ్చి నిర్మాణం పూర్తి చేయాలి. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం పూర్తయితే కడెం మండలంలోని ఐదు గ్రామాల్లో మూడు వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. లక్ష్మీపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం ఐదు గ్రామాల రైతులు ఎన్నో ఏళ్లుగా వేచి చూస్తున్నారు. దానిని సహకారం చేసే దిశగా ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

సంక్షిప్త సమాచారం



మంత్రికి పుష్పగుచ్చం అందజేస్తున్న నాయకులు

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన నిర్మల్ నాయకులు

నిర్మల్ కల్చరల్, జూన్ 7: ల్యాబ్ టెక్నీషియన్స్ జిల్లా నాయకులు పలువురు శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. దీనిలో భాగంగా ల్యాబ్ టెక్నీషియన్స్ రాష్ట్ర నాయకుడు నేరెళ్ల ప్రమోద్, నాయకులు శ్రీధర్, తోట నర్సయ్య మంత్రిని కలిసి పుష్పగుచ్చం అందజేసిన వారిలో ఉన్నారు.

ఈనెల 10న ప్రజావాణి

నిర్మల్ కల్చరల్, జూన్ 7: ఈనెల 10 సోమవారం నుంచి ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసినందున తిరిగి యథావిధిగా కొనసాగిస్తామన్నారు. ప్రజావాణి ప్రజలు ఉపయోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

నేడు చేప మందు పంపిణీ

సారంగాపూర్, జూన్ 7: మండలంలోని బీరవెల్లిలో మృగశిర కార్తెను పురస్కరించుకొని శనివారం సంగం కృష్ణ లింగం సోదరులు చేప మందును పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది ఆయుర్వేద ఔషధాన్ని చేప పిల్లలతో కలిసి తయారు చేసిన చేప మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ చేప మందుతో దగ్గు, దమ్ము, ఉబ్బసం వంటి వ్యాధులు తొలగిపోతాయని పేర్కొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి : పీడీఎస్‌యూ

నిర్మల్ కల్చరల్, జూన్ 7: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్లపై నియంత్రణ చట్టం తీసుకురావాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మహేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభానికి ముందునుంచే అక్రమంగా ఫీజులు వసూలు చేస్తూ యూనిఫాం, ఇతర వాటిని అమ్ముతున్నారని ఆరోపించారు. డీఈవో పాఠశాలలను తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులు చేపట్టాలని, సౌకర్యాలు కల్పించాలని వారు ఈ సందర్భంగా కోరారు.

'చదువుతోనే ప్రగతి'

భైంసా, జూన్ 7: నేటి పోటీతత్వ యుగంలో చదువుతోనే ప్రగతి సాధ్యమవుతుందని మోహన్‌రావ్ ప్రజా ట్రస్టు చైర్మెన్ బోస్లే మోహన్‌రావ్ పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వేదం పాఠశాలలో పది ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ట్రస్టు ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించి సత్కరించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ బోస్లే మోహన్‌రావ్ పాటిల్ మాట్లాడారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ నిర్వహణలో

కమిషన్ నిబంధనలు విస్మరించవద్దు

● జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ● కలెక్టరేట్‌లో పరీక్ష సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ● పాల్గొన్న అదనపు కలెక్టర్, ఇతర అధికారురలు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



పాల్గొన్న జిల్లా అధికారులు, సిబ్బంది

నిర్మల్ కల్చరల్, జూన్ 7: ఈ నెల 9న నిర్మల్ జిల్లాలో నిర్వహించే గ్రూప్- 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో కమిషన్ నిబంధనలు విస్మరించవద్దని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ పలు సూచనలు చేస్తూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. రూట్ అధికారులు తమ లోకేషన్లను ముందుగా చూసుకోవాలన్నారు. శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. ఉదయం 7గంటల వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఉదయం 9 నుంచి 10 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలన్నారు. ప్రతీఒక్క అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని, అధికారులు, సిబ్బందితో పాటు ఏఒక్కరూ మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, బూట్లు, బెల్టులతో అనుమతించవద్దని ఆదేశించారు. అభ్యర్థుల హాల్ టికెట్లు, ఫొటోలు, ఇతర గుర్తింపు కార్డులతో సరిపోల్చుకున్న తరువాతే అనుమతించాలన్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష నిర్వహణ ఉంటుందని విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, జిరాక్స్ కేంద్రాలు మూసి వేయించాలన్నారు. పరీక్ష నిర్వహణలో అలక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పరీక్ష నిర్వహణపై తీసుకుంటున్న చర్యలు నోడల్ అధికారి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ వివరించారు. ప్రాంతీయ సమన్వయకర్త గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● 'అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి'

నిర్మల్ కల్చరల్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కమిటీల ద్వారా జరుగుతున్న పనులు త్వరితగతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పనుల పురోభివృద్ధి, ఏకరూప దుస్తులు పంపిణీ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. పాఠశాలల ప్రారంభానికి ముందే అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటి వరకు పూర్తయిన, కావలసిన పనుల వివరాలు పాఠశాలల వారీగా అడిగి తెలుసుకున్నారు. త్రాగునీరు, మరుగుదొడ్లు, స్లాబ్ నిర్మాణ పనులు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలన్నారు. అంతేకాకుండా పనులు పూర్తయిన తరువాత పాఠశాల భవనాలకు పెయింటింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఏకరూప దుస్తుల తయారీ ప్రక్రియ వేగవంతం చేయడంపై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్ రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రగల్భాలకు దూరంగా ఉంటాం

● ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పాటిల్

భైంసా, జూన్ 7: గత ఆరు నెలల కాల వ్యవధిలో నియోజక వర్గ పరిధిలో తాను మంజూరి చేయించిన అభివృద్ధి పనులను మాత్రమే చెబుతానని, ప్రగల్భాలకు దూరంగా ఉంటానని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ పెర్కొన్నారు. శుక్రవారం భైంసాలోని తన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి రెండు రోజుల క్రితం ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావు పాటిల్ పేర్కొన్న అంశాలకు పరోక్షంగా జవాబునిచ్చే రీతిలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో ముథోల్ నియోజక వర్గ పరిధిలో కాంగ్రేస్ పార్టీకి ఆశాజనకమైన ఓట్లు వచ్చాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 15వేల వరకు ఓట్లు దక్కగా పార్లమెంట్ ఎన్నికల్లో 68వేల వరకు ఓట్లు వచ్చాయని వివరించారు. ఎన్నికలలో ఫలితాలు ఎప్పుడు ఒకేలా ఉండవన్నారు. పాతిక సంవత్సరాలకు పైగా తన రాజకీయ జీవితంలో ఎన్నికలకు సంబంధించి మిశ్రమ ఫలితాలను చూసానని పెర్కొన్నారు. ఓట్లు అధికంగా వచ్చినపుడు పొంగిపోవడం, తక్కువగా వచ్చినపుడు కుంగిపోవడం తమ నైజం కాదన్నారు. గెలుపోటములను ఒకేలా తీసుకుంటానన్నారు. ఫలితం, అధిక్యత ఎలా ఉన్న తాము ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. తమకు ఓట్లు వేశారా? లేదా? అన్నది పరిగణలోకి తీసుకోకుండా ప్రగతికి మాత్రమే పరిమితమవుతామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారిస్తామన్నారు. గత ఆరు నెలల కాలంలో నియోజకవర్గ పరిధిలో మొత్తం రూ.29 కోట్ల అభివృద్ధి పనులు మంజూరి చేయించామన్నారు. ఇందులో రూ.13 కోట్లతో మంజూరి చేయించిన సిరాల ప్రాజెక్టు మరమ్మతులు ఎన్నికల కోడ్ కారణంగా టెండర్ దశలోనే నిలిచిందన్నారు. రూ.8 కోట్ల ఉపాధి నిధులతో వివిధ అభివృద్ధి పనులు, రూ.2 కోట్ల నీటి వసతి కల్పన, మరమ్మతులు చేపట్టామన్నారు. మరో రూ.3 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు మంజూరి చేయించామని వివరంచారు. జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్క సారథ్యంలో నియోజక వర్గ సమస్యల పరిష్కారానికి, అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు బాధ్యతాయుతంగా చర్యలు చేపడుతున్నమని వివరించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు సయ్యాజీ భోజరామ్ పాటిల్, పొద్దుటూరి రాంచందర్ రెడ్డి, కాంగ్రేస్ ప్రతినిధులు శంకర్ చంద్రే, ఎంఏ లతీఫ్, గంగారెడ్డిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెలే నారాయణరావు పాటిల్



జాతీయ స్థాయి అవార్డును అందుకుంటున్న ఈఎంటీ పూజారి లక్ష్మణ్

భైంసా 108 అంబులెన్స్ సిబ్బందికి నేషనల్ సేవియర్ అవార్డులు

భైంసా, జూన్ 7: రెవెన్యూ డివిజన్ భైంసా కేంద్రంగా 108 అంబులెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సిబ్బందికి 108 నేషనల్ సేవియర్ అవార్డు పురస్కారం లభించింది. భైంసా 108 అంబులెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఈఎంటీ పూజారి లక్ష్మణ్, పైలట్ ఖాజామోయినోద్దీన్‌లు గుండెపోటు బారిన పడి విషమస్థితికి చేరుకున్న ఒక బాధితుడికి సీపీఆర్ చేసి ప్రాణాలు రక్షించారు. అంతేకాకుండా కడు పేదరికంతోనున్న సంబంధిత బాధితునికి కొద్ది మేర డబ్బులను పోగు చేసి ఆర్థికంగా సహాయం అందించారు. ఇలాంటి విశిష్ట సేవలు అందించినందుకు గాను ఈ పురస్కారం దక్కింది.

నేడు మృగశిర కార్తె

● ప్రారంభం కానున్న వ్యవసాయ పనులు

నర్సాపూర్(జి), జూన్ 7: వర్షాకాలానికి నాంది పలికే మృగ శిర కార్తె శనివారం నుంచి ప్రారంభం కానుంది. కార్తెను గ్రామీణ ప్రాంత ప్రజలు మిరుగు కార్తె అంటారు. జూన్ మొదటి వారంలో వచ్చే ఈ కార్తె వ్యవసాయ పనులకు రైతులు శ్రీకారం చుట్టానున్నారు. ఇన్నాళ్లు వేసవి తాపంతో ఇబ్బందులు పడ్డ జనం ఈ కార్తెలో కురిసే తొలకరి జల్లులతో ఉపశమనం పొందుతారు. కార్తి రోజు ప్రత్యేక వంటకాలను చేసుకుని ఆరగిస్తారు. మాంసాహారులు విధిగా చేపలు, కోడి మాంసం ప్రత్యేకంగా చేపలు తినేందుకు మొగ్గుచూపుతారు. వేసవికాలం ముగిసే వర్షాకాలంలో వచ్చే చలిని తట్టుకునేందుకు విధిగా చేపలు, కోడి మాంసం తింటామని పలువురు చెబుతారు. శాఖహారులు తీపి వంటకాలు తినడంలో పాటు బెల్లం వేడిని పెంచే ఇంగువ గుళికలుగా చేసుకుని మింగుతారు. ఈ రోజు ప్రజలు మిరగం పండుగగా జరుపుకోవడం అనవాయితీగా వస్తుంది. మృగశిర కార్తె రోజు చేపలు తినాలనేది సాంప్రదాయం. దీంతో అన్ని తరగతిలో ప్రజలు తమతమ స్థోమతకు తగినట్లుగా చేపలు కొనుగోలు చేయడంతో చేపలకు డిమాండ్ పెరిగింది. దీంతో వ్యాపారులు ధరలను విపరీతంగా పెంచారని ప్రజలు అంటున్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య'

కుభీర్, జూన్ 7: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రం కుభీర్‌లో సీఆర్‌పీలు ఉపాధ్యాయులతో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, ఉపకార వేతనాలు అందజేస్తారని పోషకులకు తెలియజేశారు. పోషకులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి సద్వినియోగం చేసుకోవాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జే.సాయన్న, సురేష్, సాయన్న, రావుల రవీందర్, సీఆర్‌పీ ఆనంద్, ఐఈఆర్‌పీ ప్రసా ద్, వీరేష్, ఉపాధ్యాయులు అనిత, నౌషిన్‌సుల్తానా, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు ఉన్నారు.



కుభీర్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం